
సభావేదికపై పవన్, బాబు అభివాదం


నాగలి, గదలతో పవన్, చంద్రబాబు



గూడెంలో ఉమ్మడి సభ

సూపర్ హిట్

రాష్ట్ర భవిష్యత్ కోసమే కలిశాం

ఆశీర్వదించండి.. గెలిపించండి

- ఉమ్మడి వేదికపై చంద్రబాబు, పవన్ పిలుపు
- సభలో భావోద్వేగాలు.. అభిమానుల కేరింతలు
- దూర ప్రాంతాల నుంచి భారీగా రాక
- ఎన్నికల ముందే టీడీపీ-జనసేన శ్రేణులకు అధినేతల దిశా నిర్దేశం

తాడేపల్లిగూడెం/ఏలూరు/భీమవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి బృందం): 'టీడీపీ-జనసేన పొత్తు తాడేపల్లి ప్యాలెస్‌ను కకావికలం చేస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం, వివిధ వర్గాల భవిష్యత్తు కోసం మేం కలిశాం. మమ్మల్ని ఆశీర్వదించండి.. గెలిపించండి' అంటూ టీడీపీ-జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అత్యంత ఉద్వేగంతో వైసీపీ పైకి వారు సవాళ్లు విసిరారు. ఇది నిజమా..? కాదా ? అంటూ సభికుల నుంచి సమాధానాలు రాబట్టిన ప్రసంగాలు సాగిన తీరు అందరిని హత్తుకుంది. 'తెలుగు జన విజయ కేతనం జెండా' పేరిట పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద బుధవారం సాయంత్రం నాలుగున్నరకు మొదలైన భారీ బహిరంగ సభ రాత్రి ఎనిమిది గంటల వరకు సాగింది. టీడీపీ-జనసేన ఎన్నికల పొత్తులో భాగంగా ఇటీవల 99 మంది పోటీ చేసే అభ్యర్థులతో తొలి జాబితాను ఇరు పార్టీలు ప్రకటించాయి. దీని తర్వాత ప్రజలకు ఉమ్మడి సంకేతం ఇచ్చేందుకు సాగిన సభకు తొలిసారిగా అధినేతలు ఇద్దరు ఒకే వేదిక పైకి వచ్చారు. ఇది అటు పవన్ అభిమానులకు, ఇటు చంద్రబాబు కేడర్‌కు పండుగగా మారింది. ఇరువురు నేతలు పరస్పర ఆలింగనాలు సభికులకు మరింత కనువిందు చేసింది. ప్రత్యేకించి పొత్తు ఆ తదుపరి అభ్యర్థుల ప్రకటన తర్వాత ఎంతో క్రమశిక్షణతో నేతలు ఇద్దరు ఉమ్మడిగా జరిగిన సభలో అందరి మనసులు దోచారు. చంద్రబాబు సైతం సుమారు 50 నిమిషాలపాటు ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఎన్నికల ముందు ముద్దులు.. గెలిచాక మీడియాతో సహా అందరిపైన పిడిగుద్దులా అంటున్నపుడు సభికులు అవును అవునంటూ తెలిపారు.

కలిసే నడుస్తున్నాం : చంద్రబాబు

'ప్రజలకు రోషం ఉందా.. మాకైతే రోషం ఉంది. ఒక సీనియర్‌గా జరుగుతున్నం దంతా చూస్తూ ఊరుకోలేను. ప్రశ్నించే గుణం ఉన్నా పవన్ సైతం మౌనంగా ఉండలేదు. జనం కోరుకునే వెలుగు మీకు ఇచ్చే బాధ్యత మాది' అంటూ చంద్రబాబు భరోసా ఇవ్వడం అందరిని సంతృప్తి పరిచింది. రాష్ట్ర విభజన అంశాలు ప్రజలకు గుర్తు చేస్తూ అప్పట్లో జరిగిన నష్టాన్ని ఎత్తిచూపాం. ఇప్పటికి అదే ధోరణిలో రాష్ట్రాభివృద్ధికి అనువుగానే జనసేన టీడీపీ లక్ష్యాల తీరు ఉందని చంద్రబాబు ప్రజలకు పదే పదే వివరించారు. ప్రజల కోసం కన్న కలల సౌధాన్ని జగన్ వచ్చి నాశనం చేశాడు. పొత్తు ఎందుకని ఆలోచిస్తే అందరికీ అవగాహన వస్తుంది. ఆఖరికి అంతర్జాతీయ క్రికెటర్ విహారిని రాష్ట్రం నుంచి పారిపోయేలా చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అంటూ గుర్తు చేసినప్పుడు షేమ్ షేమ్ అంటూ సభికులు ప్రతిస్పందించారు. సినిమా టిక్కెట్లలోను రాజకీయాలు చేయడం ఎంత వరకు సబబు. ఇది భావ్యమా' అంటూ ప్రశ్నించి సభికుల నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ఉద్యోగుల అంశాలను ప్రస్తావిస్తూ ఇప్పుడున్న ప్రభుత్వం ఉద్యోగులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏం చేయబోతున్నామో త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కిందిస్థాయి కేడర్‌లో ఉన్న భావాలను స్పృశిస్తూ ..ఇగోలకు పోవద్దు.. ఒక పార్టీ వెనుక ఇంకో పార్టీ నడుస్తున్నట్టు భావిస్తారు. ఇదంతా కాదు రెండు పార్టీలు కలిసి నడుస్తాయని భావించాలని, అనుభవంతో చెబుతున్నానని చంద్రబాబు ప్రకటించినప్పుడు టీడీపీ-జనసేన కేడర్ సంతృప్తితో కేరింతలు కొట్టారు. టీడీపీ కేడర్ ఎంపిక తీరుపై అక్కడక్కడ అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా పరోక్షంగా ప్రస్తావిస్తూ అందరికి తగిన న్యాయం చేయడం సాధ్యం కాదని, అవకాశాలను బట్టి అందరికి ఆమోదయోగ్యంగా న్యాయం చేస్తామన్నారు.

దద్దరిల్లిన సభ


రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు. ఇరు పార్టీల అగ్రనేతలు ఒకే వేదిక పైకి రావడంతో ఈ వేదికకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. దీంతో వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు తరలి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, పవన్ వేదిక పైకి రాక ముందే పలువురు సీనియర్లు ప్రసంగించారు. వీరి ప్రసంగాలు ఆకర్షించాయి. నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణంరాజు, బాలకృష్ణ, వలవల బాబ్జి, దుర్గేష్, కొత్తపల్లి సుబ్బారాయుడు వంటి వారు మాట్లాడడంతో జనం కేరింతలతో సభ దద్దరిల్లింది. రఘురామకృష్ణంరాజు సెటైర్లు వేస్తున్నపుడు వేదికపై ఉన్న పవన్, చంద్రబాబు ముసిముసి నవ్వులు చిందించారు. తాను వచ్చే ఎన్నికల్లో నరసాపురం నుంచి పోటీ చేస్తానని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించినప్పుడు సభలో కేరింతలు విన్పించాయి.



> నాకు ఎవరి సలహాలు అక్కరలేదు. ఇటీవల సలహాలు ఇస్తూ బహిరంగ లేఖలు రాస్తున్నారు. కొందరు సీనియర్ల లేఖలు పొత్తుపై ప్రభావం చూపుతున్నాయి. ఒంటరిగా పోటీ చేసే శక్తి ఇప్పటికిప్పుడు జనసేనకు లేదు. నాపై విమర్శలు చేసే వారు ముందుగా దీనిపై ఆలోచించాలి.
> - పవన్ కల్యాణ్

నాకు సలహాలు అక్కర్లేదు : పవన్

పవన్ కల్యాణ్ కూడా కాస్తంత ఉత్తేజభరితంగానే మాట్లాడుతూ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఇంతకు ముందు జరిగిన తన ఓటమిని గుర్తు చేసుకున్నారు. పొత్తులో జనసేన ఎన్ని సీట్లు తీసుకోవాలి.. సీఎం పదవిని ఎలా పంచుకోవాలి అంటూ లేఖలతో సలహాలు ఇచ్చిన వారందరికి నర్మగర్భంగా మాట్లాడుతూ చెక్ పెట్టారు. ఆయన ఏమన్నారంటే.. 'నాకు ఎవరి సలహాలు అక్కరలేదు. జగన్ వెనుక ఉన్న సమూహాలు మాత్రం తప్పు చేసినా దోపిడీ చేసినా ఆహా.. ఓహో అంటూ ఉన్నారు. వెనకేసుకొస్తున్నారు. కాని, సామాన్యుడు రాజకీయం చేస్తే ఇలాగే ఉంటుందని నిరూపిస్తా. ఎవరికి ఎంత ఓపికో పరీక్షించుకోవాలి. నాతో నిలబడి.. నా వెంట నడిచేవారే నా వాడు. అంటూ పవన్ ఉద్వేగంగా మాట్లాడటంతో సభికులు నుంచి స్పందన లభించింది. ప్రత్యేకించి సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు, నేను రాష్ట్రం కోసమే కలిసి పని చేస్తామంటూ స్పష్టం చేశారు.





వేదికపై నేతలు

> రాష్ట్రంలో కులాల మధ్య, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి సర్వ నాశనం చేయాలని జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. నేను, పవన్ రాష్ట్రాన్ని నెంబర్-1 చేయాలనుకుంటున్నాం. బాధ్యత కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేశాం. వచ్చే ఎన్నికల్లో మన గెలుపును ఎవరూ ఆపలేరు.
> - చంద్రబాబునాయుడు

అందరి చూపు వేదిక మీదే..

ఓ వైపు సభా సమయం రాత్రి గడుస్తున్నా అందరిచూపు వేదిక మీదే వుంది. టీడీపీ-జనసేన రాష్ట్ర నియోజకవర్గ నేతలు ఆశీనులు కావడమే నిదర్శనం. ఏ ఒక్క పార్టీ తక్కువ కాదని అంతా సమానమేని అన్నట్టుగా వేదికపైన మొత్తం 500 మంది కూర్చోగా రెండు పార్టీల నేతలకు చెరి సగం అన్నట్టుగానే సభా వేదిక ఏర్పాటు చేశారు. ఒక వైపు టీడీపీ జెండా, మరో వైపు జనసేన జెండా ఉండేలా ఈ పతకాల కిందే ఇరు పార్టీలు నేతలు ఆశీనులయ్యారు. ప్రత్యేకించి జనసేనలో కొత్తగా చేరిన కొత్తపల్లి సుబ్బారావు, కొణతాల రామకృష్ణ వంటి సీనియర్ నేతలు సైతం కొద్దిసేపు ప్రసంగించారు. రామకృష్ణ అయితే జనసేన టీడీపీ మాదిరిగానే ఈ రెండింటితో బీజేపీ కలిసి వచ్చేలా చూడాలని కోరడం మరో విశేషం. పవన్ తమ ప్రసంగం ఆఖరిలో బీజేపీకి జై అంటూ ముగించారు. టీడీపీ పక్షాన వేదిక ముందు భాగంలో చంద్రబాబుతోపాటు అచ్చెన్నాయుడు, బాలకృష్ణ, సీతారామలక్ష్మి, పితాని సత్యనారాయణ, వలవల బాబ్జి, రఘురామకృష్ణంరాజు కూర్చుండగా పవన్ పక్కన నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కొటికలపూడి గోవిందరాజు, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. టీడీపీలో సీనియర్ నేతలు బుచ్చియ్యచౌదరి, చినరాజప్పతో పాటు కొలుసు పార్థ సారథి, చింతమనేని ప్రభాకర్, ముళ్లపూడి బాపిరాజు, కంభంపాటి రామ్మోహన్, నిమ్మల రామానాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత పాల్గొన్నారు.



అభిమానుల జోష్

తెలుగుదేశం-జనసేన ఉమ్మడి సభలో అభిమానుల జోష్ అంతా ఇంతా కాదు. కార్యకర్తలను, అభిమానులను అడ్డుకోవడం పోలీసులు తరం కాలేదు. వీవీఐపీ గ్యాలరీకి అభిమానులంతా తోసుకుపోయారు. పోలీ సులు సైతం చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను వీక్షించేందుకు ఫ్లడ్‌లైట్ స్తంభాలను ఎక్కేశారు. మహిళలు అందుకు పోటీ పడ్డారు. పసుపు చీరలు ధరించి వేలాదిగా మహిళలు సభకు తరలి వచ్చారు. దివ్యాంగులు సభకు విచ్చేశారు. అభిమానులు నృత్యాలతో చిందులు వేశారు. ఎండను సైతం లెక్కచేయలేదు. ఉభయ గోదావరి జిల్లాలతోపాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు. సిరపు వాసు అనే దివ్యాంగుడు ఒంటి కాలితోనే విశాఖ నుంచి స్కూటీపై ఇక్కడకు వచ్చి సభకు హాజరయ్యాడు. చిన్నారులు సైతం సభలో హల్‌చల్ చేశారు.


వేదికపై టీడీపీ, జనసేన నేతలు



బటన్‌రెడ్డిని సాగనంపుదాం


కొటికలపూడి గోవిందరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు



- పవన్ కల్యాణ్, చంద్రబాబు ఉమ్మడిగా ఈ ఎన్నికలకు పోటీకి రావడం అనేది ఇది ఒక గొప్ప కాంబినేషన్. రాష్ట్ర భవిష్యత్తుకు పునాది. రాష్ట్ర భవిష్యత్తు కోసం జెండా ఎగుర వేద్దాం. ఈవీఎం బటన్ నొక్కి.. బటన్ రెడ్డిని పారద్రోలుదాం.

ఇది దోపిడీ పాలన

బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి



- రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లింది. దోపిడీలు పెరిగాయి. హత్యలు, దౌర్జన్యాలతో ప్రజలను హింసిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిని ఏ సీఎం పాలనలో చూడలేదు. ఢిల్లీ వెళ్లే ముఖ్యమంత్రి పోలవరం ప్రాజక్టు, రాష్ట్ర అభివృద్ధి గురించి అడగకుండా కేసులు మాఫీకే తిరుగుతున్నారు. విశాఖను నాశనం చేశారు. అందుకే మనం అందరం ఒక్కటిగా ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదాం.

తాడేపల్లిగూడెంలో సమస్యల తిష్ఠ

వలవల బాబ్జి, టీడీపీ తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి



- సీఎం జగన్ విధ్వంసకర పాలన అంతమొందించేందుకే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడి సభ ఏర్పాటు చేశారు. గూడెంలో టీడీపీ హయాంలో చేపట్టిన ఎన్నో అభివృద్ధి పనులను ఈ ప్రభుత్వం వచ్చాక వదిలేశారు. ఇక్కడ డిప్యూటీ సీఎం చిల్లరకొట్టు సత్యనారాయణ అధ్వాన్న పాలన వల్ల రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, అండర్ గ్రౌండ్ డ్రెయిన్, ఏపీ నిట్‌లో సీట్లు వంటి సమస్యలు ఉండిపోయాయి.

దుర్మార్గ పాలనను అంతమొందిద్దాం

కందుల దుర్గేష్, జనసేన రాజమండ్రి రూరల్ ఇన్‌చార్జి



- రాష్ట్రంలో అరాచక దుర్మార్గ పాలన అనే కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణార్జునులు వంటి చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపును దిశా నిర్దేశంగా భావిద్దాం. సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్ పాలనను అంతమొందిద్దాం.

దుర్మార్గ ప్రభుత్వాన్ని అడ్డుకోవడానికే..

మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు



ఓటు చీలకూడదు, జగన్ గెలవ కూడదు. అతని దుర్మార్గ ప్రభుత్వాన్ని అడ్డుకోవడానికే పవన్, చంద్రబాబు కలిశారు. వీరి కలయికలో స్వార్థం లేదు. రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా మంచి సంకల్పంతో ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నాం. ఈ పాలన పారద్రోలి సువర్ణ అధ్యాయాన్ని సృష్టిద్దాం.

జగన్‌ను తరిమికొట్టాలి

బొమ్మిడి నాయకర్, జనసేన నరసాపురం ఇన్‌చార్జి



- జగన్ మరోసారి అధికారం కోసం ఎన్నో అబద్ధాలతో ప్రజల వద్దకు వస్తున్నాడు. మత్స్యకారులను మోసం చేశాడు. అతన్ని తరిమికొట్టకపోతే పొట్ట చేత పట్టుకుని రాష్ట్ర ప్రజలు పొరుగు రాష్ట్రాలకు పారిపోవాల్సిందే.

రాష్ట్రం బిహార్‌ను గుర్తుచేస్తోంది

కేఎస్ జవహర్, మాజీ మంత్రి



- బిహార్‌లో దారుణాలను గుర్తు చేసేలా జగన్ పాలన సాగుతోంది. దళితులను హత్య చేస్తున్నారు. దాడులు పెరిగాయి. దీనిని అంత మొందించడానికి చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఏకమయ్యారు. మళ్లీ ఇప్పుడు జగన్ క్రైస్తవులను, హిందువులు, ముస్లింలను మోసం చేస్తూ ముందుకు వస్తున్నారు.



హైవేపై బైక్ ర్యాలీ.. సభా ప్రాంగణం వద్ద ఫ్లెక్సీలు


హైవేపై కార్ల ర్యాలీ


వేదికపై నాయకులు

జెండా జోష్


వేదికపై జనసేన పార్టీ నాయకులు




ఒళ్ళంతా జెండాలతో..


తెలుగుదేశం పార్టీ నాయకులు


అన్న..ఎన్టీఆర్


దాహం తీర్చేందుకు చల్లని మజ్జిగ




ఫ్లడ్‌లైట్, ఫ్లెక్సీ స్తంభాలపై అభిమానులు

పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో బుధవారం జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు జనం పోటెత్తారు.. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు తమ ప్రసంగాలతో ఇరుపార్టీల కార్యకర్తల్లో జోష్ నింపారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు.


వయసు పైబడినా తగ్గేదేలే..


రెక్కలు విరిగిన ఫ్యాన్


తెలుగు మహిళల సందడి


తాడేపల్లిగూడెం నుంచి జనసేన ర్యాలీ




వేదిక ముందు యువత ఉత్సాహం

నేడు తాలూకా కేంద్రాల వద్ద ఏపీటీఎఫ్ ధర్నా

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : ఏపీజేఏసీ ఇటీవల తలపెట్టిన చలో విజయవాడ ఆందోళన వాయిదా వేయడాన్ని నిరసిస్తూ దానిస్థానే సొంత పోరు బాటను పట్టిన ఏపీటీఎఫ్ గురువారం జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో ధర్నాకు పిలుపునిచ్చింది. నేటి నుంచి ఏలూరు పాత తాలూకా కేంద్రం వద్ద నిర్వహించనున్న ధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సీపీఎస్ రద్దు, 30 శాతం మధ్యంతర భృతి, పెండింగ్ డీఏల మంజూరు తదితర డిమాండ్‌లను ప్రభుత్వం ఎదుట ఉంచుతున్నామన్నారు.


3న విశాఖలో 'మహాగర్జన'

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మార్చి 3న విశాఖపట్నంలో 'మహాగర్జన', ర్యాలీ, బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. వాల్‌పోస్టర్‌ను గురువారం ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ సభ్య సంఘం ఏపీఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర చైర్మన్ దయామణి ఆవిష్కరించారు. మహాగర్జన కు ఉద్యోగులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 99 శాతం హామీ లను అమలు చేశామని చెబుతున్న ప్రభుత్వం చిరుద్యోగులకు సమస్యలను విస్మరించిందన్నారు. జాతీయ ఆరోగ్య పథకం (ఏపీఎన్‌హెచ్‌ఎం) స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆప్తాల్మిక్ టెక్నీషియన్లు, 108 వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచారంలో బాలలను వినియోగిస్తే కఠిన చర్యలు

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: రానున్న సాధారణ ఎన్నికల ప్రచారంలో బాలలను వినియోగించకూడదని రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారని డీఆర్వో డి.పుష్పవాణి అన్నారు. బుధవారం డీఆర్వో ఛాంబర్‌లో ఓటర్ల జాబితా ప్రచురణ, పోలింగ్‌స్టేషన్‌లలో మౌళిక సదుపాయాలపై రాజకీయపార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఫారం -7 క్రింద 1595 తొలగింపుకు ఎన్నికల ప్రధాన అధికారి అనుమతించారని తెలిపారు. జిల్లాలో 16 లక్షల 24 వేల 939 మంది ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయపార్టీ ప్రతినిధులు డి.రత్నబాబు, నెరుసు నెలరాజు,ఆదిశేషు, ప్రసాద్, అచ్యుత్‌బాబు,కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్సు ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



పెంటపాడు,, ఫిబ్రవరి 28: దేశ ఆర్థిక వ్యవస్థకు ఇంజనీరింగ్, సాంకేతికత, పరిశోధనలు మూల స్తంభాలని విద్యార్థులు సైన్స్ ఆధారిత ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. నిట్ ప్రాంగణంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దినేష్ శంకర్ మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భారత ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపచేసిన ఘనత సీవీ రామన్‌కే దక్కుతుందన్నారు. సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ సందీప్, రాముడు, తపస్ కిరణ్‌కుమార్, రఫీ పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా భావంతో మెలగాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 28: విద్యార్థులు చదువుతోపాటు సేవాభావంతో మెలగాలని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ మాజీ అధికారి టీబీఆర్ చైర్మన్ టి.భోగేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్న గూడెంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉద్యాన కళాశాలలో బుధవారం యువ సంవాద్ ఇండియా 2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు మాధవి, సలోమి సునీత, శివకుమార్, ఉదయశ్రీ, పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరపనున్నారు. జిల్లాలో 50 కేంద్రాలలో 1వ తేదీ నుంచి 20 వరకు పరీక్షలు జరుగు తాయి. ప్రథమ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు 17,806, ద్వితీయ సంవత్సరం 18,143 మంది హాజరు కావల్సి ఉంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు సెల్‌ఫోన్ రహిత జోన్‌గా ప్రకటించారు. పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ఏ అధికారి వద్ద సెల్‌ఫోన్ ఉండదని ఒక్క చీఫ్ సూపరిండెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ వద్ద బేసిక్ ఫోన్ ఉంటుందని ఎగ్జామ్ కన్వీనర్ చంద్రశేఖర్ బాబు తెలిపారు. ఇంటర్ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని అధికారులు చెబుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష సమయం అని అరగంట ముందే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్స్ తీసుకు రాకూడదన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

డ్రోన్‌ల వినియోగంపై రైతులకు అవగాహన అవసరం

ఉండి, ఫిబ్రవరి 28: రైతులకు డ్రోన్ వినియోగంపై ప్రత్యేక అవగాహన అవసరమని డాక్టర్ ముకుందరావు అన్నారు. బుధవారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. మార్టేరు అసోసియేట్ డైరక్టరు ఆఫ్ రీసెర్చ్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముకుందరావు డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. పశుసంవర్థక శాఖ డీడీ హరాస్సెన్ మాట్లాడుతూ రైతులు పశుగ్రాసాన్ని పెంచుకొనేందుకు కేవీకే ప్రోత్సాహం అందించాలన్నారు. అసోసియేట్ డైరక్టరు డాక్టర్ శ్రీనివాస్ మామి డిలో పండు ఈగ నివారణకు శిక్షణ ప్రదర్శనలు నిర్వహించాలని ఆదే శించారు. మార్టేరు శాస్త్రవేత్త డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్ రాఘవేంద్రరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు డిబోరి మెషియానా, శ్రీనివాసరావు, రాజేష్, బి.రజిత, మత్స్యశాఖ అధికారిణి ప్రియదర్శిని, భైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పుల్లంరాజు, తదితరులు పాల్గొన్నారు. రైతులు నెక్కంటి సుబ్బారావు, వెంకట రత్నం, చందులను సత్కరించారు.

ఆన్‌లైన్‌లో ఫ్యాన్ ఆర్డర్ పెడితే రంగు డబ్బాలు..



పెనుమంట్ర, ఫిబ్రవరి 28 : ఆన్‌లైన్ యాప్‌లో ఒక యువకుడు ఫ్యాన్ బుక్ చేస్తే ఖాళీ రంగు డబ్బాలు రావడంతో నిర్ఘాంతపోయిన సంఘటన పెనుమంట్ర మండలం మార్టేరులో జరిగింది. మార్టేరుకు చెందిన నగేష్ ఆన్లైన్‌లో ఫ్యాన్ బుక్ చేశాడు. అయితే ఖాళీ పెయింట్ డబ్బా, అట్టముక్కలు రావడంతో బాధితుడు అవాక్కయ్యాడు. రిటర్న్ పంపి కంప్లైంట్ ఇస్తానని నగేష్ తెలిపారు.


కాళ్ళ మండలం పెద అమిరంలో బుధవారం జరిగిన పాలకొల్లు వైసీపీ నాయకుడు గుణ్ణం నాగబాబు కుమారుడు మణికంఠ, విజయదీప్తిల వివాహ వేడుకలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించండి

మహా శివరాత్రి ఏర్పాట్లపై జేసీ సమీక్ష



పోలవరం, ఫిబ్రవరి 28 : పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అధికారులకు సూచించారు. బుధవారం పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహా శివరాత్రి ఉత్సవాల రెండవ సమీక్షా సమావేశం ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య అధ్యక్షతన నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ అధికారులకు, విద్యుత్ అధికారులకు సూచించారు.ఆలయ కార్యనిర్వహణాధికారి సంగమేశ్వర శర్మ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశా మన్నారు. సమావేశానికి ఏజీఆర్‌బీ ఈఈ హాజరు కాకపోవడం పట్ల జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ హైవే అధికారులు రోడ్డుకి మరమ్మతులు చేశామన్నారు. ఆర్టీసీ అధికారులు జంగారెడ్డిగూడెం డిపో నుంచి 30 బస్సులు, తాడేపల్లిగూడెం నుంచి 15 బస్సులు, కొవ్వూరు డిపో నుంచి 25 బస్సులు నడుపుతామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ తెలిపారు. డిప్యూటి డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఉత్సవాల్లో 4 ప్రాంతాల్లో అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఇసుక తిన్నెల్లో రెండు చోట్ల ఫెర్రీ ర్యాంపులో 1, ఆలయ ప్రాంగణంలో 1 ఏర్పాటు చేస్తున్నామని, 104, 108 , వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. మత్స్య శాఖ అధికారులు మాట్లాడుతూ నదిలో ప్రమాదాలకు తావులేకుండా 90 మంది గజ ఈతగాళ్ళను మూడు షిప్టులుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బోట్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ నదిపై కాలినడక మార్గం కోసం 6 పంట్లు ఏర్పాటు చేస్తున్నామని 4 తేదీ సాయంత్రానికి అందజేస్తామన్నారు. జిల్లా పంచాయతీ అధికారి, తహశీల్దారు జీవీ.ప్రసాద్, సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, డీటీ ప్రసాద్, ఆలయ ట్రస్టీ జగన్నాధరావు,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీస్‌స్టేషన్‌లో తప్పిపోయిన బాలుడు



బుట్టాయగూడెం, ఫిబ్రవరి 28: తప్పిపోయిన బాలుడు బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడని ఆచూకి తెలిసినవారు సంప్రదించాలని ఎస్ఐ కె.వెకన్న తెలిపారు. దొరమామిడిలో ఒక బాలుడు ఒంటరిగా ఉండడం గమనించిన ఒక వ్యక్తి ఊరుపేరు అడిగితే బుట్టాయగూడెం వైపు వేలు చూపు తున్నాడని తాను లోపలి గ్రామానికి వెళ్ళిపోతానని పిల్లవాడిని బుట్టాయగూడెంలో దింపవలసిందిగా అటుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న మరొకరికి అప్పగించి వెళ్ళిపోయినట్లు పోలీసులు తెలిపారు. తెల్లంవారి గూడెం నుంచి బాలుడిని బుట్టాయగూడెం తీసుకువచ్చిన వ్యక్తి పిల్లవాడి పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఊరు పేరు అడుగుతున్నా చెప్ప లేకపోవడంతో స్టేషన్లో అప్పగించాడన్నారు. వివరాలు తెలిసిన వారు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

చెట్టు కొమ్మ విరిగిపడి ఒకరి మృతి

పాలకోడేరు, ఫిబ్రవరి 28 : మృత్యువు ఏ రూపంలో వస్తుందో ఎవరికీ తెలియదు. పాలకోడేరులో బుధవారం రాత్రి జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. పాలకోడేరుకు చెందిన తోట వెంకన్న (45) పని నుంచి వచ్చి ఇంటికి సమీపంలో రహదారి పక్కన ఒక రాయిపై కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇంతలో మోగల్లు వైపు నుంచి భీమవరం వెళ్తున్న ఇసుక లారీ పాలకోడేరు గ్రామంలోని కొత్తపేట వద్ద రహదారి పక్కనే ఉన్న కొబ్బరి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొబ్బరిచెట్టు విరిగి రాయి మీద కూర్చొన్న వెంకన్నపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

కడుపునొప్పి తట్టుకోలేక ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 : కడుపునొప్పితో బాధపడుతున్న ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముసునూరు మండలం వలస పల్లికి చెందిన మల్లినేని సురేష్ (38) వ్యవసాయం చేసేవాడు. కడుపునొప్పికి తాళలేక బుధవారం పురుగుమందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తణుకు, ఫిబ్రవరి 28 : తణుకు మండలం తేతలికి చెందిన వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. తేతలి గ్రామానికి చెందిన గంటా దైవసీతికి అదే గ్రామానికి చెందిన అనిల్ కుమార్‌తో గతేడాది వివాహమైంది. దైవసీతి ఈనెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్ళి రాకపోవడంతో, చుట్టుపక్కల గాలించి ఆచూకీ లేకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కీచక ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన ..ఫోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 28 :పదో తరగతి విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ప్రాథమికోన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ (స్కూల్ అసిస్టెంట్) ఉపాధ్యాయుడు సస్పెన్షన్‌కు గురయ్యాడు. బుధవారం బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. తమ పిల్లలపై పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీహరిబాబు అసభ్యకర చేష్టలు చేస్తుంటే హెచ్‌ఎం, అధికారులు పట్టించుకోక పోవడం దుర్మార్గమని వాపోయారు. ఇటీవల పాఠశాలలో యూనిఫాం కొలతలను సేకరించే సమయంలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు స్కూల్‌కి వచ్చి సంబంధిత ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలంటూ ఆందోళన చేశారు. విద్యార్థినిలపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు శ్రీహరిబాబుపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు.దీనిపై విద్యాశాఖ అధికారులు విచారణ చేసి ఉన్నతాధికారులకు తెలిపారు. ఉపాధ్యాయుడు శ్రీహరి బాబును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం ఉత్తర్వులు జారీ చేసినట్టు మండల విద్యా శాఖ అధికారి రాముడు తెలిపారు.

రక్షణ కల్పించండి..ఎస్పీకి జడ్పీ చైర్మన్ వినతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 : తన కారును వెంబడించి ఢీ కొట్టేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ఎస్పీని కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతికి వినతిపత్రం అందించారు. ఈ నెల 27 రాత్రి సత్యవోలు వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తూరులో టీడీపీ నాయకుడు చింతమనేని ప్రభాకర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించుకుంటున్నారని తమ కార్లకు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. కొందరు మూడు కార్లతో తమను వెంబడించి ఢీ కొట్టడానికి ప్రత్నించారన్నారు. జిల్లా ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.

గోడ కూలి చిన్నారి మృతి

తణుకు, ఫిబ్రవరి 28: రోడ్డుపై నడిచి వెళుతున్న చిన్నారిపై అకస్మాత్తుగా గోడ కూలి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. ఇరగవరం మండలం పేకేరుకు చెందిన చిక్కా విజలక్ష్మి (5) చిన్నారికి మెడపై కంతి ఉండటంతో చిన్నారి తల్లి వేణి రెండు రోజులు క్రితం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం బలిజేపల్లి వారి వీధిలో ఉన్న ఆమె బంధువుల ఇంటికి తీసుకెళ్ళారు. చిన్నారిని తల్లి వేణి మంగళవారం నడిపించుకొని ఇంటికి తీసుకువెళుతుండగా పెరవలి మండలం పిట్టలవేమవరానికి వచ్చే సరికి గుడిమెట్ల రమాదేవి స్థలానికి చుట్టూ ఉన్న గోడ అకస్మాత్తుగా కూలి పక్కనే నడుస్తున్న చిన్నారిపై పడింది. దీంతో తలకు తీవ్ర గాయమైంది. చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారుల ఫిర్యాదు మేరకు స్థల యజమాని రమాదేవిపై పోలీసులు కేసు నమోదు చేశారు.







చంద్రబాబుకు బొకే అందిస్తున్న వలవల, గన్ని.. భీమవరంలో ర్యాలీని ప్రారంభించిన మేరగాని నారాయణమ్మ.. నరసాపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి పొత్తూరి.. తణుకు నుంచి ర్యాలీగా బయలుదేరిన ఆరిమిల్లి, నాయకులు.. కొమ్ముచిక్కాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు

తెలుగు జన విజయకేతనం జెండా సభకు తరలివెళ్లిన టీడీపీ-జనసేన శ్రేణులు

భీమవరం అర్బన్/వీరవాసరం, ఫిబ్రవరి 28: తాడేపల్లిగూడెంలో 'తెలుగు జన విజయకేతనం' మహాసభకు భీమవరం నుంచి వేలాదిమంది జనసేన-టీడీపీ నాయకులు తరలి వెళ్లారు. తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో భీమవరం నియోజవర్గం నుంచి పదివేల మంది టీడీపీ నాయకులు కార్యకర్తలు సభకు తరలి వెళ్లారు. ర్యాలీని టీడీపీ డ్వాక్రా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరగాని నారాయణమ్మ జెండా ఊపి ప్రారంభించారు. కృష్ణబలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంటా త్రిమూర్తులు ఆధ్వర్యంలో పది బస్సుల్లో, కార్లు, బైక్‌లపై తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, మహాసభ ప్రత్యేక పరిశీలకులు గొట్టుముక్కల రఘురామరాజు, దాసరి ఆంజనేయులు, వేండ్ర శ్రీనివాస్, ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గంటా నాగలక్ష్మి, కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, రేవు వెంకన్న తదితరులు ఉన్నారు. వీరవాసరం మండలం నుంచి తాడేపల్లిగూడెం టీడీపీ, జనసేన బహిరంగ సభకు మండలం నుంచి 50 ఆటోలు, ప్రతీ గ్రామం నుంచి ఐదు కారులు చొప్పున కార్యకర్తలు వెళ్ళేందుకు నాయకులు ఏర్పాట్లు చేశారు. మత్స్యపురి, బొబ్బనపల్లి, నందమూరుగరువు, పెర్కిపాలెం, మత్స్యపురిపాలెం గ్రామాల నుంచి ఈ వాహనాలు నవుడూరు జంక్షన్ మీదుగా ర్యాలీగా తరలి వెళ్ళాయి. టీడీపీ మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాసరావు, వీరవల్లి చంద్రశేఖర్ , యరకరాజు గోపాలకృష్ణంరాజు, రాయపల్లి వెంకట్, జనసేన మండలశాఖ అధ్యక్షుడు జవ్వాది బాలాజీ, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● నరసాపురం, ఫిబ్రవరి 28:తీర ప్రాంతం నుంచి టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి సుమారు వంద కార్లలో టీడీపీ నాయకులు బయలుదేరారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. జనసేన ఇన్‌చార్జి నాయకర్, ఇటీవల పార్టీలో చేరిన కొత్తపల్లి సుబ్బారాయుడు, రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు.

● ఆచంట/పెనుగొండ/పోడూరు/పెనుమంత్ర, ఫిబ్రవరి 28: తాడేపల్లిగూడెంలో టీడీపీ జనసేన భారీ బహిరంగ సభకు ఆచంట మండలం నుంచి మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చేగొండి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు కార్లు, బైక్‌లతో తరలి వెళ్లారు. పెనుగొండ మండలంలో పలు గ్రామాల నుంచి ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. వెలిచేటి బాబూరాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నుంచి తరలివెళ్లారు. నక్కా వేద వ్యాసశాస్త్రి, కటికిరెడ్డి నానాజీ, మండా ప్రసాద్, వేండ్ర రాము తదితరులు ఉన్నారు. పోడూరుమండలం నుంచి 25 బస్సులు, 600 ఆటోలు, ఆరువేల మందికి పైగా బైక్‌లు మీద వెళ్లి సభను విజయవంతం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దాసరి రత్నరాజు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు, జనసేన మండల అధ్యక్షు డు పితాని వెంకట్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన శ్రేణులు తరలివెళ్లారు. పెనుమంత్ర మండలం నుంచి 142ఆటోలు, ఎనిమిది వందల బైకులు, 40 కార్లలో మూడు వేల మందికి పైబడి జనసైనికులు టీడీపీ కార్యకర్తలు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీరామ దుర్గారెడ్డి ఆధ్వర్యంలో నత్త రామేశ్వరం ఆలయం నుంచి భారీ మోటార్‌సైకిల్ ర్యాలీగా వెళ్లారు. మార్టేరు తేతలి రాజారెడ్డి గెస్ట్‌హౌస్ నుంచి ఆటోలు కార్లలో భారీగా జనసైనికులు టీడీపీ నాయకులకు సీనియర్ టీడీపీ నాయకుడు మల్లిడి మీరారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 18గ్రామాల నుంచి మూడు వేల మందికి పైగా కార్యకర్తలు సభకు తరలి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు తవనంపూడి శ్రీనివాస్‌రెడ్డి, కోణాల కోదండ చంద్రశేఖర్‌రెడ్డి, కోణాల శ్రీనివాసరెడ్డి, చిర్ల శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ అలీ, ఏడుకొండలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● పాలకోడేరు/కాళ్ల, ఫిబ్రవరి 28 : రాబోయేది టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి రాఘవ్ కోటేశ్వరరాజు, ఉండి నియోజకవర్గ బీసీ టీడీపీ నాయ కుడు కామన రాంబాబులు అన్నారు. పాలకోడేరు మండలం నుంచి బస్సులు, కార్లు, బైక్‌లపై భారీగా తరలి వెళ్లారు. ర్యాలీని వారిద్దరూ జెండా ఊపి ప్రారంభించారు. కమ్మిలి రాంబాబు, కొండపల్లి ఏసురత్నం, మండల ప్రసాద్, బాబీ, జుత్తిగ శ్రీనివాస్, బోసురాజు, కార్యకర్తలు ఉన్నారు. కాళ్ళ మండలం నుంచి ఎమ్మెల్యే రామరాజు ఆధ్వర్యంలో సుమారు మూడువేల మంది కార్యకర్తలు, నాయకులు బస్సులు, కార్లు, ఆటోలు, మోటార్ బైక్‌లపై తరలి వెళ్లారని టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు, ఎరుబండి రామాంజనేయులు తెలిపారు.

● పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 28 :తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ, జనసేన భారీ బహిరంగ సభకు పాలకొల్లు నుంచి టీడీపీ, జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పాలకొల్లు పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు, కోడి విజయభాస్కర్, నియోజకవర్గ జనసేన కన్వీనర్ శిద్ధిరెడ్డి అప్పారావు, జనసేన జిల్లా నాయకులు బోనం చినబాబు ఆధ్వర్యంలో బస్సులు, ఆటోలు, ఇతరతర వాహనాల్లో తరలివెళ్లారు. వేలాదిమంది టీడీపీ, జనసేన శ్రేణులు బైక్‌లుపై ర్యాలీగా వెళ్లి సభను విజయవంతం చేశారు.

● తణుకు/ఇరగవరం ఫిబ్రవరి 28: అవినీతి జగన్ ప్రభుత్వాన్ని సాగనంపడమే టీడీపీ, జనసేన లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఆరిమిల్లి నివాసం నుంచి కార్లు, మోటారు సైకిళ్ళు, ఆటోలతో భారీ ర్యాలీగా టీడీపీ, జనసేన శ్రేణులు తాడేపల్లిగూడెం జెండా సభకు తరలి వెళ్ళారు. ఇరగవరం మండలం నుంచి జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీసంఖ్యలో బయలుదేరి వెళ్ళారు. యువకులు పార్టీ జెండాలు ద్విచక్ర వాహనానికి కట్టుకుని ర్యాలీగా బయలుదేరారు.

భారీ కార్ల ర్యాలీతో బీసీ నేత వాసంశెట్టి సుభాష్

భీమవరం : కోనసీమ జిల్లాకు చెందిన శెట్టిబలిజ నాయకుడు ఇటీవలే వైసీపీ నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వాసంశెట్టి సుభాష్ తన అనుచరగణంతో కలిపి ఊరేగింపుగా తాడేపల్లిగూడెం సభకు హాజరయ్యారు. అమలాపురం, రాజోలు, గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో బీసీ కులాలను సమీకరించి ఊరేగింపుగా వాహనాలతో విచ్చేశారు. కోనసీమ టీడీపీ నాయకుడు ఐతా బత్తుల ఆనందరావు, పలువురు బలిజ యువజన సంఘాలు ఉన్నారు.



గొల్లకోడేరు నుంచి సభకు వెళ్తున్న టీడీపీ, జనసేన నాయకులు



కోనసీమ జిల్లా నుంచి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో..

జోరుగా చిరు వ్యాపారాలు



పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 28: ప్రత్తిపాడు జాతీయ రహదారి సమీపంలో టీడీపీ- జనసేన ఉమ్మడిగా నిర్వహించిన తెలుగు జన విజయ కేతనం జెండా బహిరంగ సభ విజయవంతం కావడమే కాక ఎంతో మంది చిరు వ్యాపారుల వ్యాపారం పెంచింది. సభా ప్రాంగణం సమీపంలో పదుల సంఖ్యలో చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎవరూ కూడా ఖాళీలేకుండా తమ వ్యాపారాలు చేసుకుని ఆనందంగా ఇళ్లకు వెళ్లారు.



భారీ ట్రాఫిక్ జామ్

» పలువురు వాహనాలు విడిచి నడిచే సభకు..

తణుకు, ఫిబ్రవరి 28: తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ-జనసేన జెండా సభకు వెళ్లే వాహనాలు పెద్దఎత్తున ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి. సుమారు కిలో మీటరు మేర జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో సభకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు వాహనాలు ఖాళీ ప్రాంతంలో వదిలి నడిచి వెళ్లారు. ట్రాఫిక్ క్లియర్ చేయడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. అలంపురం నుంచి ప్రత్తిపాడు జాతీయ రహదారి జంక్షన్ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. పలు ప్రాంతాల నుంచి బస్సులు, ఆటోలు, మోటారు సైకిళ్ళ ద్వారా సభకు వచ్చే వారంతా ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. అష్టకష్టాలు పడి సభా ప్రాంగణానికి చేరారు.

తాడేపల్లిగూడెంలో భారీ ర్యాలీ..

పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 28: తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డు సెంటర్ నుంచి ఫ్లై ఓవర్, ప్రత్తిపాడు వైజంక్షన్ మీదుగా జనసేన నాయకులు, కార్యకర్తలు సుమారు 10 వేల మందికి పైగా మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జనసేన, టీడీపీ జెండాలు చేతపట్టుకుని ఉమ్మడి ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ సాగారు. ఈ ర్యాలీకి తాడేపల్లిగూడెం మండలం, పెంటపాడు మండలం, పట్టణం నుంచి జన సైనికు లు, వీరమహిళలు భారీగా తరలివచ్చారు. ర్యాలీకి జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు రాజేష్ నాయకత్వం వహించారు.

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణం, పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలంలోని గ్రామాల నుంచి తెలుగు తమ్ముళ్లు, మహిళలు, యువత తరలి వచ్చారు. కార్లు, ఆటోలతో పాటు మోటారు సైకిళ్లతో ఈ సభకు తరలి వచ్చారు. సభా వేదిక సమీప గ్రామాల నుంచి ప్రజలు పాదయాత్రగా సభావేదికకు చేరుకున్నారు. వారితోపాటు న్యాయవాదులు, తెలుగు మహిళలు పసుపు చీరలు ధరించి సభావేదికకు తరలివచ్చారు.



తాడేపల్లిగూడెం నుంచి ర్యాలీగా తరలి వెళుతున్న జనసేన కార్లు

మూడో విడత రైతు భరోసా సొమ్ము విడుదల



రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్

భీమవరం: ఫిబ్రవరి 28 :కౌలు, సన్న, చిన్నకారుల రైతులకు వెన్నుదన్నుగా వైస్సార్ రైతు భరోసా నిలుస్తుందని ప్రతిరైతు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ అన్నారు. వరుసగా ఐదో ఏడాది- మూడో విడతగా జిల్లాలో రైతు బరోసా-పీఎం కిసాన్ 1,27,114 మంది రైతులకు రూ. 25.42 కోట్లు, సున్నా వడ్డీ పంట రుణాలు 39,270 మంది రైతులకు రూ.5.53 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేసేందుకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి ఖాతాల్లో నేరుగా జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ గాంధీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఛైర్మన్ కైగాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి, సభ్యులు, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, రైతులు తదితరులు కార్యక్రమాన్ని వర్చువల్‌గా తిలకించారు. సంబంధిత నమూనా చెక్కులను రైతులకు అందజేశారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అమలు చేయాలి

భీమవరంటౌన్, ఫిబ్రవరి 28 : రానున్న పార్లమెంటు, శాసనసభ ఎన్నికల సందర్భంగా పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల నివేదికలు భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శిక్షణార్థులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ స్పందన సమావేశం మందిరంలో ఎన్నికల వ్యయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలు, నిబంధనల పుస్తకాలను బాగా చదువుకోవాలని ఏమైనా సందేహాలు ఉంటే నోడల్ అధికారులను సంప్రదించాలన్నారు. ఎన్నికల ఖర్చుల రకాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వలెన్స్, వీడియో సర్వలెన్స్ వీడియో వ్యూయింగ్, ఎక్సైజ్, అకౌంటింగ్, ఎంసీ బృందాలు నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవ ర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేయుటకు అనుమతి ఉందని, శాసనసభ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయుటకు అనుమతి ఉందన్నారు. అంతకుమించి ఖర్చు చేస్తే ఆయా అభ్యర్థులు అర్హత కోల్పోతారన్నారు. శిక్షణ తరగతుల్లో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్‌వో బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు

భీమవరంలో 'మెగా రిటైల్ ఎక్స్‌పో' ప్రారంభం



ఖాతాదారులకు రుణ పత్రాలు అందిస్తున్న రీజనల్ హెడ్ శ్రీమతి సంగీతకుమారి, తదితరులు

భీమవరం: ఫిబ్రవరి 28 : భీమవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో 'మెగా రిటైల్ ఎక్స్‌పో' కార్యక్రమం యూబీఐ రీజనల్ హెడ్ శ్రీమతి పి.సంగీతకుమారిచే భీమవరం డీఎన్ఆర్ కాలేజి సెమినార్ హాల్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో భీమవరం ప్రముఖ కార్ల డీలర్స్, బిల్డర్స్ హాజరయ్యారు. మా బ్యాంకులో తక్కువ వడ్డీ రేటులకే హౌసింగ్ లోన్, కార్ లోన్, ఎడ్యుకేషన్ లోన్ అందిస్తామని ఆమె తెలిపారు. 28 ఖాతాదారులకు 6 కోట్ల రూపాయల రుణాలు మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో డీఆర్ హెచ్ఆర్ దివాకర్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ ఎస్.రమేష్, ఎస్.వి.వి.రమణ, చీఫ్ మేనేజర్లు, బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

తణుకు, ఫిబ్రవరి 28: తణుకు చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాలలో గురువారం రాష్ట్ర కళాశాల విద్యాశాఖ, జేకేసీ సంయుక్తంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్ కుమార్ చెప్పారు. జాబ్ మేళాకు తణుకు, తాడేపల్లిగూడెంలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

అత్తిలి, ఫిబ్రవరి 28: అంగన్‌వాడీ కేంద్రాల అభ్యున్నతికి దాతలు ముందుకురావడం అభినందనీయమని అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి 252 అంగన్‌వాడీ కేంద్రానికి వెలగల వెంకటరెడ్డి, సతీమణి సుజాత, వారి కుమారుడు దశరథరెడ్డి కుర్చీలు బహూకరించారు. అంగన్‌వాడీ సహాయకురాలు శ్రీవిజయవాణి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు

భీమవరంటౌన్/భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : మూఢ నమ్మకాలు పారద్రోలి, కాంతి మార్గంలో నడిపిన భారతరత్న సర్ సీవీ రామన్ గుర్తుగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని పర్యావరణ శాస్త్రవేత్త మట్లపూడి సత్యనారాయణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పీఎస్ఎం గరల్స్ హైస్కూల్‌లో హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 34 మంది విద్యార్థులు సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్నారని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ఫిజికల్ సైన్స్ టీచర్ ఎం.డి. అహ్మద్ ఉన్నీసా, కె.శ్రావణి, సుధ, ఎం.భాగ్యలక్ష్మిలను రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగి ఎస్.కె. చాంద్ బాషా సౌజన్యంతో సత్కరించామన్నారు. డీఎన్నార్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ అంతకుమారి ఆధ్వర్యంలో సైన్స్ విజ్ఞానానికి సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. రసాయిన శాస్త్ర విభాగాధిపతి ఎస్.అనిల్‌దేవ్, ఎన్‌వీవీ సింహాద్రి, పి.దివ్యశ్రీ, జియాలజీ విభాగాధిపతి కె.సంతోష్, రాజు, సిరిచందన, విద్యార్థులు పాల్గొన్నారు. ఆదిత్య విద్యార్థులు స్కూల్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి జిల్లా సమన్వయ అధికారి మల్లుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సైన్స్ నమూనా ప్రదర్శనలు నిర్వహించారు.

● పెనుగొండ/ఆచంట, ఫిబ్రవరి 28: పెనుగొండ భాష్యం పాఠశాలలో ప్రిన్సిపాల్ అప్పారావు ఆధ్వర్యంలో, ఆచంట మండలం కొండమంచిలి హైస్కూలులో సర్పంచ్ సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్ఎంసీ ఛైర్మన్ బలుసు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తణుకు, ఫిబ్రవరి 28: ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ ఆనంద్ యువత సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండకపోవడం వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించారు. ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ ఆనంద్‌ను కళాశాల యాజమాన్యం సత్కరించింది. వివేకానంద గ్లోబల్ కార్యదర్శి చిట్టూరి రీనా సాయి పాల్గొన్నారు. తణుకు మాంటిస్సోరి స్కూల్‌లో డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు ఆధ్వర్యంలో వందకు పైగా నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. తణుకు మండలం వెంకటరాయపురంలోని చదలవాడ ఇంగ్లీషు మీడియం స్కూలులో ప్రిన్సిపాల్ చదలవాడ బులిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు.

● గణపవరం : సైన్స్ ప్రయోగాలు సృజనాత్మకతను వెలికితీస్తాయని జల్లికొమ్మర ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలో జల్లికొమ్మర సర్పంచ్ కురేళ్ళ వెంకటరత్నం అన్నారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ బుద్దార వెంకటేశ్వరరావు, హెచ్ఎం సుందర్‌కుమార్ పాల్గొన్నారు. గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ నిర్మలకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తణుకు చదలవాడ స్కూలు విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శన

వైభవంగా కోదండ రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

కాళ్ళ, ఫిబ్రవరి 28 : ఆనందపురం గ్రామంలోని కోదండ రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ హనుమత్ సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న సహిత రామచంద్రస్వామి వారి విగ్రహాల ప్రతిష్ఠను ప్రారంభించారు. భక్తులు తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మె ల్యే వెంకట శివరామరాజు, జనసేన ఉండి ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజుతో పాటు పలువురు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

పాలకోడేరులో వేణుగోపాలస్వామి విగ్రహం..

పాలకోడేరు, ఫిబ్రవరి 28 : పాలకోడేరు గ్రామం గరువు మారెమ్మ గుడి సెంటర్లో నూతనంగా నిర్మించబడిన వేణుగోపాలస్వామి దివ్య విగ్రహం ప్రతిష్ఠ కొత్తపల్లి రామరాజు, లక్ష్మీకాంతం దంపతులచే బుధవారం వైభవంగా జరిగింది. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మంతెన రామరాజు, డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వైసీపీ నాయకులు మంతెన యోగీంద్రకుమార్‌బాబు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, ఉపసర్పంచ్ దెందుకూరి వెంకట్రాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, లక్ష్మీపతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొండ్రుప్రోలులో ఐశ్వర్య గణపతి విగ్రహం..

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 28: కొండ్రుప్రోలులో ఐశ్వర్య గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమా రాధన నిర్వహించారు.

బాల త్రిపురసుందరికి పెన్నులతో అలంకరణ

భీమవరంటౌన్, ఫిబ్రవరి 28: మెంటేవారితోటలోని బాలత్రిపుర సుందరిదేవికి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మావుళ్ళమ్మ దేవస్థానం సభ్యులు మావూరి సుందరరావు, రుక్మిణీదేవి దంపతులు, నీలం సుబ్బారావు, లక్ష్మి మంగతాయారు దంపతులచే కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి రెండు వేల పెన్నులతో అలంకరణ చేసి అనంతరం ఇంటర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. మూడు రోజులపాటు విద్యార్థులకు ఈ పెన్నులు అందిస్తామని అర్చకుడు శ్రీనివాస్ తెలిపారు.

ఎట్టకేలకు హార్బర్ పనులకు భూమిపూజ

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 28: ఎట్టకేలకు బియ్యపుతిప్ప హార్బర్ పనులకు బుధవారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు భూమి పూజ చేసి ప్రారంభించారు. 2022 నవంబరులో సీఎం జగన్ హార్బర్‌కు శంకుస్థాపన చేశారు. రూ.430 కోట్లతో నిర్మించే ఫిషింగ్, కార్గో పోర్టు పనులకు షెడ్యూల్ ప్రకారం 2023లో ప్రారంభంచాల్సినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు హార్బర్ నిర్మాణం చేపట్టాలంటూ పెద్దఎత్తున ఉద్యమించడంతో ఎట్టకేలకు పనుల్ని మొదలుపెట్టారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు, ఏఎంసీ ఛైర్మన్ రాధాకృష్ణ, అండ్రాజు చల్లారావు, ఉంగరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం



సమస్యలపై నిలదీస్తున్న కౌన్సిలర్లు (ఇన్‌సెట్‌లో) ఛైర్‌పర్సన్ వెంకటరమణ

నరసాపురం, ఫిబ్రవరి 28: పట్టణంలోని శానిటేషన్ నిర్వహణపై బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్వపక్ష, విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ వెంకటరమణ ఆధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీ సభ్యులు పాలూరి బాబ్జీ, జనసేన సభ్యులు సూర్యకుమారి, భరత్ సురేష్, కృష్ణవేణి, ఆరుణ, వైసీపీ సభ్యులు వన్నెంరెడ్డి శ్రీను, సఖినేటిపల్లి సురేష్, కేసరి గంగరాజు, శ్రీకాంత్ పట్టణంలోని పారిశుధ్యంపై ప్రస్తావించారు. ఏ వార్డులోనూ రోజువారీ శానిటేషన్ జరగడం లేదు. పది రోజులకు ఒకసారి చెత్త తొలగిస్తున్నారు. అధికారులు కౌన్సిలర్లు చెప్పినా... సిబ్బంది పని చేయడం లేదంటూ మండిపడ్డారు. దీనిపై కమిషనర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తదితర సమస్యలపై చర్చించారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గారపాటిని గెలిపించాలి : అనంతశ్రీరామ్

గణపవరం, ఫిబ్రవరి 28: పదహారేళ్ళుగా సమాజ సేవే ధ్యేయంగా పని చేస్తున్న గారపాటి సీతారామంజనేయ చౌదరిని రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించుకుంటే అభివృద్ధి సాధ్యమని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. బుధవారం గణపవరం మండలం గణపవరం, అర్థవరం, పిప్పర, మొయ్యేరు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి గారపాటి తరపున జబర్దస్త్ కళాకారులు, సినీగాయకులు ప్రచారం చేశారు. తపనా ఫౌండేషన్ , బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాలను వివరించారు.

'స్వదేశీ పరిజ్ఞానంతోనే వికసిత్ లక్ష్యాలు'

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతోనే వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని అంతర్జాతీయ పరిశోధకుడు డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సైన్స్‌డే సందర్భంగా ఇంజనీరింగ్ కెమిస్ట్రీ, ఇంజనీరింగ్ ఫిజిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ వర్షపునీటిని ఆదా చేయడంతో పాటు సేంద్రియ సాగును కూడా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం కళాశాల ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ వీపీ రామకృష్ణంరాజు అనుసంధాన్ కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, డాక్టర్ పి. భవాని, డాక్టర్ ఎంవీ సోమేశ్వరరావు, డాక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఆచంటేశ్వరుడి శివరాత్రి ఉత్సవాలు

ఆచంట , ఫిబ్రవరి 28: ఆచంటేశ్వరుని మహాశివరాత్రి ఉత్సవాలు వచ్చే నెల 6 నుంచి 10వతేదీ వరకు జరుగతా యని, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ సుగుణసంధ్య తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆలయం వద్ద అధికారులతో ఆమె స మావేశం నిర్వహించారు. శివరాత్రి పర్వదినం రోజున భక్తులు కోడేరు గోదావరిలో స్నానాలు చేస్తారని రేవు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, రథోత్సవం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ఏర్పాటు చేయాలన్నారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జరిగే అన్నసమారాధనలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ ఈవో రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆలయ ఛైర్మన్ బి. విద్యాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నత్తా రామేశ్వరంలో..

పెనుమంత్ర, ఫిబ్రవరి 28 : నత్తారామేశ్వరంలోని రామేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 8న జరిగే మహాశివరాత్రి ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేయాలని తహసీల్దార్ లక్ష్మీకళ్యాణి అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఈవో ఆర్. గంగాశ్రీదేవి అధ్యక్షతన అధికారులు, గ్రామస్థులతో ఆమె సమావేశం నిర్వహించారు. భక్తుల ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు, వైద్య ఆరోగ్యశాఖ మూడు ప్రాంతాల్లో ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రథోత్సవం నిర్వహించే సమయంలో విద్యుత్ లైన్లను తొలగించి అనంతరం విద్యుత్ పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు. సర్పంచ్ వెలగల ధర్మారెడ్డి ఎంపీడీవో పద్మజ రాంప్రసాద్ ఏఎస్ఐ వేండ్ర వెంకటేశ్వరరావు, ఫైర్ ఆఫీసర్, ఎలక్ట్రికల్ ఏఈ, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భోగలింగేశ్వరస్వామి ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ

భీమవరం రూరల్, ఫిబ్రవరి 28:మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని వీరమ్మపార్క్ వద్ద ఉన్న పార్వతి సమేత భోగ లింగేశ్వరస్వామి మహాశివరాత్రి కరపత్రాలను బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఉత్సవాలు 6వ తేదీన ప్రారంభమై 10వ తేదీతో ముగియనున్నాయి. కార్యక్రమంలో కట్రెడ్డి సీతారామయ్య, ఎర్రంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

పెనుగొండ, ఫిబ్రవరి 28: స్థానిక డిగ్రీ కళాశాలలో రెండో అంతర్జాతీయ తెలుగు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.పద్మరాజు మాట్లాడుతూ తెలుగు భాష అమ్మ భాష అని, తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. తెలుగు భాషా సంచాలకులు డాక్టర్ మూర్తి రేమెళ్ళ ప్రపంచ స్థాయి తెలుగు భాష సదస్సును ఏర్పాటు చేసిన స్థానిక డిగ్రీ కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ అప్పారావు, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విశ్రాంతి ఉపకులపతి జార్జ్ విక్టర్ మాట్లాడారు. కళాశాల సిబ్బం ది, తెలుగు భాష పండితులు అధ్యాపకులు, కవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరవాసరం, ఫిబ్రవరి 28: మత్స్యపురి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఈఈ బళ్ళ సురేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. మత్స్యపురి, బొబ్బనపల్లి, మెంటేపూడి , నరసాపురం మండలంలో మల్లవరం, మల్లవరంలంక గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు జ్యూస్ వితరణ

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 28: భద్రతా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి పేర్కొన్నారు. విజయవాడ భద్రతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం తాడేపల్లిగూడెంలోని ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు టెట్రా జ్యూస్ అందించారు. డిపో సూపర్‌వైజర్లు డీఎం మాధవరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే దినోత్సవం

మొగల్తూరు/ఆచంట/తణుకు, ఫిబ్రవరి 28 :ప్రభుత్వం టైలర్ వృత్తి చేసుకునే వారికి ప్రోత్సాహాన్ని అందించాలని టైలర్స్ అసోసియేషన్ కోరింది. ఫిబ్రవరి 28 ప్రపంచ టైలరింగ్ దినోత్సవం సందర్భంగా బుధవారం మొగల్తూరులోని బాపూజీ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ సృష్టికర్త విలియం హోమ్ చిత్రపటానికి నివాళులర్పించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బొల్లా శ్రీరామచంద్రమూర్తి, నంబాల రమేష్, పడవల సత్యనారాయణ, షరాబు సూర్యనారాయణ, పీట్టా శాంతారావు, సురేష్, బొక్కా రాజేశ్వరరావు, బొల్లా కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఆచంటలో శివసాయిటైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు కొలుకరి సత్యనారాయణ, సంఘ యూనియన్ అధ్యక్షుడు బాలం నాగేశ్వరరావు, బాలాజీ, కడలి యుగంధర్, మాముదూరి నాగేశ్వరరావు, ఎం.నాగు పాల్గొన్నారు. తణుకు మండలం వేల్పూరులో టైలర్స్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే నిర్వహించారు. సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, సంఘ గౌరవాధ్యక్షుడు బళ్ళ చినవీరభద్రరావు పాల్గొన్నారు.